

# స్వామియే శరణం అయ్యప్ప



**అకుంఠిత దీక్ష,** అంతులేని ఆత్మవిశ్వాసంతో సన్నిధానానికి చేరుకొని స్వామిని దర్శించడమే అయ్యప్ప దీక్షలోని ఆంతర్యం. ఈ దీక్ష అద్వితీయమైన నియమాలతో రూపొందించింది. అయ్యప్ప దీక్షను పాటించే సమయమిదే. 41 రోజుల పాటు కఠోర నియమాలు పాటిస్తూ, నిష్టగా పూజాది కార్యక్రమాలు ఆచరించే భక్తులకు పవిత్రమైన రోజులివి. తనువు, మనస్సును చెడు నుంచి మంచి మార్గం వైపు మళ్లించే ఈ దీక్షను స్వీకరించిన భక్తులు స్వామియే శరణం అంటూ అయ్యప్ప సేవలో తరిస్తుంటారు. ఈ దీక్ష కఠోర నియమాలతో కూడుకున్నప్పటికీ, దీక్ష వల్ల వచ్చే మానసిక ఆనందం, ఆత్మ పరిశీలన శక్తి, అపూర్వమైన ఆధ్యాత్మిక ఆనందం దీక్షాపరులకు అనుభవంలోకి వస్తాయి. శివునికి ప్రీతిపాత్రమైన కార్తీకమాసంలో కఠిన నియమ, నిష్టలతో అయ్యప్ప దీక్షలు చేపట్టడం జన్మజన్మల పుణ్యఫలంగా భావిస్తారు. ఆధ్యాత్మిక చింతన, ఆరోగ్య నియమాల కలబోత అయిన అయ్యప్ప దీక్ష విశేషాలపై ప్రత్యేక కథనం...

- రామాయంపేట/శివ్వంపేట, డిసెంబర్ 2

- అయ్యప్ప మాలధారణ.. ఆధ్యాత్మికం, ఆరోగ్యదాయకం
- ప్రారంభమైన అయ్యప్ప మండల దీక్షలు
- ప్రత్యేక పూజలతో సందడిగా మారనున్న మణికంఠుని కోవెలలు
- మార్మోగనున్న స్వామి నామస్మరణ




మాలధారణ చేస్తున్న గురుస్వామి (ఫైల్)

## ఇరుముడి ప్రత్యేకత..

అయ్యప్ప దీక్షలో ఇరుముడికి ప్రత్యేకత ఉన్నది. దీక్ష తీసుకున్న స్వాములు శబరిమలై ప్రయాణంలో మొదటి ఘట్టం ఇరుముడి, ఇరుముడి ధరించే అయ్యప్పస్వామి తెల్లవారుజామున ఇంటి గుమ్మం వద్ద కొబ్బరికాయ కొట్టి ఎవరితోనూ మాట్లాడకుండా ఆలయానికి వెళ్లి గురుస్వామితో ఇరుముడి కట్టించుకోవాలి. ఇరుముడితో శబరిమలై వెళ్లిన వారికి 18 మెట్లు ఎక్కే అర్హత లభిస్తుంది.

## మాల విరమణ..

అయ్యప్ప స్వామి దీక్ష పూర్తి చేసుకున్నాక శబరియాత్రకు వెళ్లిన అయ్యప్పస్వాములు అక్కడే దీక్ష విరమిస్తున్నారు. ఇంకొందరు తిరుపతిలో మొక్కలు తీర్చుకుని అక్కడ కూడా విరమిస్తున్నారు. అలా కాకుండా శబరి యాత్ర పూర్తయ్యాక దీక్ష పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వచ్చి మాతృమూర్తి ద్వారా మాల విరమించుకోవాలని గురుస్వాములు సూచిస్తున్నారు.



## పడిపూజ ఎందుకు..?

అయ్యప్ప సన్నిధానంలో 18 మెట్లు ఉంటాయి. ఇవి కామం, క్రోధం, లోభ, మోహ, మద, మత్సర్యాలైయిన అరిషడ్వర్గాలని ప్రతీతి. మనిషిలోని 18 రకాల చెడు గుణాలు తొలగిపోవడానికి దీక్షలో పడిపూజ (మెట్టు పూజ) నిర్వహిస్తారు. అయ్యప్ప మాల ధరించిన ప్రతిసారి చెడు లక్షణాలను విడిచిపెట్టి మంచి వారిగా మారాలని కోరుకుంటూ ఈ పూజను నిర్వహిస్తారని గురుస్వాములు చెబుతారు.

## అయ్యప్ప దీక్షా నియమాలు..

- అయ్యప్పదీక్ష తీసుకున్న భక్తులు నల్లని దుస్తులు ధరించాలి.
- 41రోజుల పాటు (మండలం రోజు) నియమ నిష్టలు పాటించాలి.
- దీక్షా సమయంలో తల, గడ్డం, వెంట్రుకలు, గోళ్లను తీయడం నిషేధం.
- చెప్పులు ధరించొద్దు.
- తెల్లవారుజామున అమృత ఘడియల్లో (సూర్యోదయానికి ముందు) చల్లని నీటితో స్నానం ఆచరించాలి. సాయంత్రం కూడా చల్లని నీటితో స్నానం ఆచరించాలి.
- నుదుట విబూది, గంధం, కుంకుమ మధ్యలో బొట్టు పెట్టుకోవాలి
- ఒక్కపూట భోజనం (మధ్యాహ్నం భిక్ష) రాత్రి పండ్లు, ఫలహారం అల్పాహారంగా తీసుకోవాలి.
- కటిక నేలపై నిద్రించాలి.
- అశుభ కార్యాలు జరిగే ప్రదేశాలకు, దుఖ: సంబంధమైన ఘటనల్లో పరామర్శకు వెళ్లరాదు.
- పగలు నిద్రించకూడదు. శవాన్ని చూడకూడదు. మనస్సును అదుపులో ఉంచుకొని శరణుఘోష చెప్పుకోవాలి.
- పూజ చేసుకున్న తర్వాత ఉదయం, సాయంత్రం వృత్తి రీత్యా పనులు చేసుకోవచ్చు.
- తన శక్తికొలది ఒక్కసారైనా ఐదుగురు అయ్యప్పలకు భిక్ష పెట్టాలి.
- హింసాత్మక చర్యలు, దుర్భాషలాడడం, అబద్ధాలాడడం చేయరాదు.
- దీక్షా సమయంలో హోదా, వయస్సు, పేద, ధనిక తేడా లేకుండా అయ్యప్పలందరికీ పాదాభివందనం చేయాలి.

## అయ్యప్ప అవతారం..



పూర్వకాలంలో మహిషి అనే రాక్షసి బోళా శంకరుడి వరం పొంది ప్రజలను ఇంద్రాది దేవతలను సైతం హింసించేది. తనకు ఆడ,మగ కలయికతో పుట్టిన వారితో గానీ, విల్లుతో గానీ, ఆయుధాలతో గానీ మరణం ఉండకుండా వరం పొందింది. ఆ తర్వాత ఇంద్రాది లోకాలకు వెళ్లి వికృత చేష్టలకు దిగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. మహిషి చేష్టలకు భయాందోళన చెందిన దేవతలు మహా విష్ణువును శరణు కోరతారు. దీంతో ఆయన మోహినీ అవతారమెత్తి పరమ శివుడిని మోహిస్తాడు. వీరద్దరి కలయికతో అయ్యప్ప జన్మిస్తాడు. మణిమాలతో కేరళ రాజ్యంలోని అటవీ ప్రాంతంలో పాండ్యరాజులకు దొరుకుతాడు. మణిమాలతో దొరికిన ఆ శిశువుకు మణికంఠుడు అని నామకరణం చేస్తారు. మణికంఠుడు మహిషిని వధించి దేవతలు, మునుల పూజలందుకుంటాడు. అనేక మహిమలతో పాండ్య రాజులకు, ప్రజలకు దగ్గరవుతాడు.



## కన్నెస్వాములు ఎంతో ప్రత్యేకం..

శబరి కొండల్లో ఉండే మాలికాపురోత్తమ అయ్యప్పస్వామిని ప్రేమిస్తుంది. తనను వివాహం చేసుకోవాల్సిందిగా కోరుతుంది. ఇది విన్న స్వామివారు చిరునవ్వుతో తిరస్కరిస్తాడు. అయినా ఆమె పట్టువీడదు. దీంతో కన్నెస్వాములు తన మాల ధరించి రానప్పుడు వివాహమాడుతానని స్వామి ఆమెకు మాట ఇచ్చాడు. నూతన మాలధారులైన కన్నెస్వాములు రాకుండా ఉండడం ఎప్పటికీ జరగదని దీనిలో పరమార్థం. ఇందులో భాగంగానే ఏటేటా కన్నెస్వాముల సంఖ్య పెరుగుతూనే వస్తుంది. తొలిసారి మాలవేసే కన్నెసాములతోపాటు వరుసగా కత్తిస్వామి, గంట స్వామి, గధస్వామి, గురుస్వాములుగా పిలుస్తారు. 9నుంచి 18సార్లు శబరిమల యాత్రకు వెళ్లి వచ్చినవారు కన్నెస్వాములు దీక్షలు చేపట్టేందుకు సహకరిస్తారు.

## మాలధారులు ఎన్ని రకాలు..?

అయ్యప్ప మాలను కొత్తగా ఈ సంవత్సరమే ధరించినవారు ఉంటారు. ఏండ్ల తరబడిగా దీక్ష స్వీకరిస్తున్నవారూ ఉంటారు. అయితే ఎవరిని ఎలా పిలుస్తారో చాలా మందికి తెలియదు. మొదటి సారి మాలధరిస్తే 'కన్నె స్వామి' అంటారు. రెండోసారి ధరించిన భక్తులను 'కత్తి స్వామి'గా పిలుస్తారు. మూడోసారి అయితే 'గంట స్వామి', నాలుగోసారి 'గధ స్వామి', ఐదోసారి 'పేరు స్వామి', ఆరోసారి ధరించినవారిని 'త్రిశూల్ స్వామి' అని వ్యవహరిస్తారు. ఏడు, అంతకన్నా ఎక్కువసార్లు ధరిస్తే 'గురు స్వామి'గా పరిగణిస్తారు. 18, అంతకన్నా ఎక్కువ సార్లు మాల ధరించినవారిని 'నారీకేళ స్వామి' అని సంబోధిస్తారు.





## ఇరుముడి అత్యంత ప్రాధాన్యం..

అయ్యప్పస్వామిని నవ విధ సేవలతో పూజిస్తుంటారు. నవ విధాలుగా అనగా శ్రావణం, కీర్తనం, స్మరణం, పాదాసేవనం, అర్చనం, నమస్కారం, ధాన్యం, స్మృతం, ఆత్మ నివేదనంతో 41రోజులు దీక్ష పూర్తి చేసిన తర్వాత ఇరుముడికి అత్యంత ప్రాధాన్యం ఉంటుంది. ఇరుముడి అంటే రెండు అని అర్థం. అనగా రెండు ముడులు అని. ముందు ముడి (మూట)లో పీఠం, భస్మం, గంధం, కొబ్బరికాయలు, నెయ్యి, పూజా సామగ్రి ఉంటాయి. వెనుక ముడి (రెండో మూట)లో ప్రయాణానికి కావాల్సిన వస్తువులుంటాయి. వీటినే పుణ్యపు మూట, పాపపు మూట అని పిలుస్తారు.



### దీక్షతో మానసిక ప్రశాంతత లభిస్తుంది



నేను గత రెండేళ్లుగా అయ్యప్ప స్వామి మాల ధరిస్తున్నాను. ఉదయం నాలుగు గంటల నుండే పూజా కార్యక్రమాలు ఉంటాయి. చల్లటి నీటిలో స్నానమాచరిం చాలి. అనంతరం అర్ధ నగ్నంగానే పూజలు చేయాలి. తెల్లారేవరకు పూజలను ముగించాలి.మధ్యాహ్నం మళ్లీ స్నానమాచరించి అయ్యప్ప స్వామి పూజలో పాల్గొని భిక్ష చేస్తాం. మళ్లీ అప్పటి నుండి రాత్రి వరకు పనులు చేసుకుని రాత్రి అల్పాహారం, భోజనం జేస్తాం. -దుడుగు హరీశ్, రామాయంపేట

### అయ్యప్పదీక్షతో మంచి ఫలితాలు



నేను గత సంవత్సరం నుండి అయ్యప్ప స్వామి మాల వేస్తున్న. ఈ దీక్షతో మంచి ఫలితాలు పొందవచ్చు. 41 రోజుల పాటు ప్రతిరోజు నిష్టతో అయ్యప్పస్వామి పూజలలో నిమగ్నమవుతాము. భక్తిభావం పెరగడంతో పాటు క్రమశిక్షణ అలవరుతుంది. అయ్యప్పస్వామి అనుగ్రహంతో అనుకున్న మొక్కులు తీరుతున్నాయి. - కుమ్మరి ప్రకాశ్, గూడురు, శివ్వంపేట



# కూరగాయల సాగుతో భలే లాభాలు

## తక్కువ పెట్టుబడి.. ఎక్కువ ఆదాయం



శివాయిపల్లిలో కూరగాయలు తెంపుతున్న మహిళ రైతులు

- కూరగాయల సాగుపై రైతుల ఆసక్తి
- రోజురోజుకు పెరుగుతున్న సాగు
- మార్కెట్‌లో కూరగాయలకు మంచి డిమాండ్
- మారుతున్న రైతుల ఆలోచనలు

రామాయంపేట రూరల్, డిసెంబర్ 2: రైతుల ఆలోచనా విధానాలు రోజురోజుకు మారుతున్నాయి. ఒకప్పుడు వరి, మొక్కజొన్న పంటలు మాత్రమే పండించేవారు. ఒకే రకమైన పంటలు వేయడంతో మార్కెట్‌లో వాటి ధరలపై అంత ప్రభావం చూపేవి కావు. తెలంగాణ ఏర్పడిన తరువాత వ్యవసాయ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యామ్నాయ పంటలతో పాటు లాభదాయక పంటలపై రైతులకు రైతు వేదికల్లో అవగాహన కల్పిస్తున్నారు. దీంతో రైతుల ఆలోచనల విధానాలు పూర్తిగా మారాయి. తక్కువ నీరు, తక్కువ పెట్టుబడితో పంటలు పండించేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా రామాయంపేట మండలంలోని చాలా గ్రామాల్లో కూరగాయల సాగు అధికంగా పెరిగింది. రైతులు ఒకే రకమైన పంటలు వేయడం దాదాపు తగ్గించారు. తమకున్న తక్కువ భూమిలోనైనా సరే వివిధ రకాల కూరగాయలు సాగు చేస్తూ గ్రామాల్లో జరిగే వారాంతపు సంతలకు తరలించి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కూరగాయలకు మంచి డిమాండ్ ఉండడంతో వాటి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. ఒకే రకమైన పంటలు తగ్గడంతో వాటి డిమాండ్ పెరిగి పంటలకు గిట్టుబాటు ధర ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నది. కూరగాయల సాగుకు రైతులకు ఇతర పంటల కంటే తక్కువ పెట్టుబడితోపాటు తక్కువ నీటి వినియోగం ఉంటుంది. డ్రిప్పుల ద్వారా కూరగాయాలకు నీరు పెడుతూ సాగు చేస్తున్నారు. రైతులు లాభాలు బాటలో పయనిస్తున్నారు.

### రోజూ డబ్బులు వస్తున్నాయి



నేను రెండెకరాల్లో కూరగాయలు సాగు చేశా. టమాట, వంకాయ, పచ్చి మిర్చి, కాకర కాయ, బీరకాయ కూరగాయలు వేశాను. వీటికి డ్రిప్పు సహాయంతో నీరు అందిస్తున్నా. ఐదేండ్లుగా కూరగాయాలు సాగు చేస్తున్నా. పండించిన కూరగాయలను ఆటోలో తరలించి అమ్ముతున్నా. దీంతో రోజూ డబ్బులు వస్తున్నాయి. ఇంట్లో ఖర్చులకు ఇబ్బంది లేకుండా ఎంతో ఉపయోగపడుతున్నాయి. మార్కెట్‌లో కూడా కూరగాయల మంచి డిమాండ్ ఉంది. ఇతర పంటల కంటే కూరగాయలతోనే ఆదాయం ఎక్కువ. - రవీందర్, రైతు, శివాయిపల్లి

### సంతలతో డిమాండ్ వచ్చింది



కూరగాయల సాగుతో మంచి ఆదాయం ఉంది. రెండేండ్లుగా కూరగాయలు పండిస్తున్నా. గతంలో పండించిన కూరగాయలు అమ్మాలంటే రామాయంపేట పట్టణానికి వారానికో సారి వెళ్లాలి వచ్చేది. కానీ ఇప్పుడు ప్రతి గ్రామంలో సంతలు నిర్వహిస్తున్నారు. దీంతో రోజుకో గ్రామంలో వారాంతపు సంతలో కూరగాయలు విక్రయించుకుంటున్నా. దీంతో రవాణా ఖర్చు కూడా తగ్గుతుంది. మంచి రేట్లు కూడా వస్తున్నాయి. రైతులకు కూరగాయల సాగుపై అవగాహన ఉంటే ఇతర పంటల కంటే ఎక్కువ ఆదాయం పొందవచ్చు.

- గోపాల్, రైతు, దంతేపల్లి తండా



లక్ష్మాపూర్‌లో గ్రామంలో జరుగుతున్న వారాంతపు సంత(ఫైల్)

# పొద్దుతిరుగుడు పంటతో లాభాలు ముద్దాడే..

- స్వల్పకాల వ్యవధిలోనే పంట చేతికి..
- 90 రోజుల్లోనే సన్‌ఫ్లవర్ పంట
- ఎకరాకు రూ.10వేలు ఖర్చు, రూ.లక్ష దిగుబడి
- ఎకరాకు 12క్వింటాళ్ల పొద్దుతిరుగుడు పంట
- సన్‌ఫ్లవర్ క్వింటాలుకు ధర రూ.12వేలపైనే

రామాయంపేట, డిసెంబర్ 2: పొద్దు తిరుగుడు పంట రైతులకు లాభసాటిగా మారింది. తక్కువ పెట్టుబడితో రైతులు ఎక్కువ లాభాలు పొందవచ్చు. గతంలో ఈ పంటను చాలా మంది సాగుచేసేవారు. ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంట వైపు మళ్లి సన్‌ఫ్లవర్‌పై రైతులు ఆసక్తి కనబర్చడంలేదు. యాసంగిలో కూడా ఈ మధ్యలో రైతులు ఎక్కువ శాతం వరి పంటే సాగు చేశారు. ప్రస్తుతం వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ పంటల వైపు మొగ్గు చూపాలని రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. దీంతో కొంతమంది పొద్దుతిరుగుడు, ఇతర పంటల సాగుకు ఆసక్తి కనబరుస్తున్నారు. పొద్దు తిరుగుడు పంట 90 రోజుల్లోన్లే చేతికి వస్తున్నది. అంతర పంటగా కూడా విత్తుకుంటున్నారు. మండలంలో పొద్దుతిరుగుడు పంట సుమారు 160 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. శివ్వాయపల్లికి చెందిన రైతు ముత్యాలు ఎకరంలో పొద్దుతిరుగుడు పంటను విత్తుకున్నాడు. ఎకరానికి రూ.10 వేల ఖర్చు కాగా, పంట స్వల్పకాల వ్యవధి 90రోజులకే పంట చేతికి వస్తుంది. ఈ పంటకు మార్కెట్‌లోనూ డిమాండ్ పెరిగింది. మార్కెట్‌లో పంట ఎక్కువగా విత్తుకోనందున క్వింటాలుకు రూ.12వేల పైనే ధర పలకనున్నది. 90 రోజుల్లోనే ఎకరం పంట వేసుకున్న రైతుకు రూ.లక్ష దిగుబడి వస్తున్నది. గతంలో కూడా పొద్దుతిరుగుడు పంటను గ్రామంలో చాలా మంది వేశారు.



శివ్వాయపల్లెలో రైతు వేసిన పొద్దుతిరుగుడు పంట

### స్వల్పకాలంలోనే సన్‌ఫ్లవర్ పంట చేతికి



స్వల్పకాలంలోనే పొద్దుతిరుగుడు పంట వస్తుంది. సుమారు 90 రోజుల వరకు ఈ పంట చేతికి వస్తుంది. పంటకు ఖర్చు తక్కువ దిగుబడి ఎక్కువగా ఉంటుంది. యాసంగిలో రామాయంపేట మండల వ్యాప్తంగా రైతులు 160 ఎకరాల్లో పొద్దుతిరుగుడు పంట వేశారు. ప్రస్తుతం ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలుకు రూ.6500, బయట మార్కెట్లో రూ.12 వేలపైనే ఉంటుంది. ఈసారి పొద్దుతిరుగుడు పంటకు డిమాండ్ బాగానే ఉంటుంది. - రాజనారాయణ, ఏవో, రామాయంపేట

### జంతువులు, పక్షులతోనే ఇబ్బందులు



పొద్దుతిరుగుడు పంట బాగానే ఉంది. కాని అడవి జంతువులు, పక్షులతోనే ఇబ్బంది. పంట చేతికొచ్చి విత్తులు రావడంతోనే ఎక్కడెక్కడి నుంచో పక్షులు పంట వద్దకు చేరుకుని విత్తులు తినేస్తాయి. అందుకే నేను రోజూ చేను వద్దనే డబ్బాతో చప్పుడు చేసుకుంటూ మంచెపైనే ఉంటా. అన్నం తినడం కూడా మంచె పైనే. చప్పుడు కాకుంటే పక్షులు గుంపులు గుంపులుగా వచ్చి పంటపైనే వాలుతాయి.

- చింతకాయల ముత్యాలు, రైతు, శివ్వాయపల్లె, రామాయంపేట మండలం